

# యవనిక

వి. రాజారామమోహనరావు

**శ్రీప్రియ రిసార్ట్స్‌లో దొరికిన వాళ్ళలో రాణీ భర్త శ్రీధర్ కూడా వున్నారు. అతనితో పాటు అలా దొరికిన వాళ్ళల్లో డబ్బు, పలుకుబడి వున్నవాళ్ళు మరి కొందరున్నారు. వాళ్ళతోపాటు శ్రీధర్ కూడా తప్పించుకున్నాడు. అంతగా అనుభవం, పలుకుబడి లేని కుర్రాళ్ళు, మామూలు మనుషులు, అరెస్ట్ అయిన ఆడాళ్ళతో కలిసి పోలీసుస్టేషన్‌కి వెళ్ళారు.**

***

పుట్టింటికి ఏలూరు రావటం అయితే వచ్చింది కానీ, రాణీ మనసు చాలా గందరగోళంగా వుంది. ఏ ఆలోచనా, సరిగ్గా సాగటం లేదు. తట్టుకోలేని అసహనం బాధపెడుతోంది.

చిత్రమేమిటంటే, తనంతగా తనే శ్రీధర్ రాణీతో చెప్పాడు. కొద్దిలో తప్పించుకున్నాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈ పాటికి పేపర్లో ఫొటోలు... టీవీ ఛానల్స్‌లో గొడవ.. పదిమందిలో ముఖం చూపించలేని పరిస్థితి... చాలా అదృష్టం.

అదృష్టం అన్నంతవరకే చెప్పి ఊరుకోలేదు శ్రీధర్. రియల్ ఎస్టేట్ పని మీద అనవసరంగా ఆ రిసార్ట్ కెళ్ళి ఇరుక్కుపోయానని అన్నాడు. అది అబద్ధం అని రాణీకి తెలుసు. అనవసరంగా వెళ్ళడమేమిటి అతని వ్యాపారమే రియల్ ఎస్టేట్.

ఎవరిద్వారానేనా తెలియకముందే భార్యతో చెప్పేస్తే మంచిదన్న అతిజాగ్రత్త కొంత... తప్పు జరిగిందన్న భావన కొంత.. అందుకే శ్రీధర్ తనంతగా తనే చెప్పాడు. వెంటనే పుట్టింటికి వచ్చేసింది.

ఏంచెయ్యాలో అర్థం కాని ఇబ్బంది... ఊపిరి ఆడనట్టుంది రాణీ మనసుకి.

తన దగ్గరవాళ్ళకి లోపల పెద్ద ఆపరేషన్‌కి జరుగుతోంటే, బైట అలజడిగా గడిపే వ్యక్తి లా తనలో తనే మథనపడుతోంది.

ఏ సంకోచం లేకుండా అన్ని విషయాలు నిర్భయంగా చెప్పుకోగలిగిన స్నేహితురాలు నాగరత్నం కోసం ఎదురు చూస్తోంది రాణి.

నాగరత్నం రాగానే జరిగిన విషయం చెప్పి... ''నేను విడాకులు తీసుకుంటాను'' అంది రాణి.

''అలాగే తీసుకో... మా ఆయనకి ఫోన్ చెయ్యనా?'' అంది నాగరత్నం. వాళ్ళాయన లాయర్.

''వేళాకోళం కాదు... సీరియస్‌గానే చెపుతున్నా..'' అంది రాణీ.

భార్యాభర్తల మధ్య ఇలాంటిదేమేనా జరిగితే, ముందు వచ్చేది ఆవేశమే. అది చల్లారితేనే కానీ, ఆలోచన సరిగ్గా సాగదు. ఆ విషయం నాగరత్నానికి తెలుసు. అందుకే జోక్ చేసింది.

ఇటువంటి గొడవ ఏ ఇల్లాలికేనా ఇబ్బందే.... రాణీ ఆవేశపడటంలో తప్పు లేదు. పెళ్ళయి రెండేళ్ళైంది. పిల్లలు లేరు. పుట్టింటి వేపు ఆస్తివుంది. చదు

వుకుంది. ఏదో ఉద్యోగం సంపాదించుకోగలదు. అన్నిరకాలుగా, విడాకులు తీసుకున్నా ఫరవాలేదని పించే పరిస్థితే.

ఈ విషయాలన్నీ నాగరత్నమే ముందుగా చెప్పి... "విడాకులు తీసుకుంటావు... దానివల్ల ఫలితమేమిటి? మనం ఏం చేసినా ఓ ఉప యోగం వుండాలిగా" అంది.

"అంటే..." అంది రాణీ. ఇంత జరిగాక శ్రీధర్‌కి దూరంగా వుండటమే అన్న అభిప్రాయం తప్ప, మరో ఆలోచన లేదు రాణీకి.

"నీకు శ్రీధర్‌తో కలిసి వుండాలనిపించట్లేదు. అంతేనా... కానీ విడి పోయాక ఏం చేస్తావో స్పష్టంగా చెప్పు... అది తేలాక విడాకుల సంగతి నిర్ణయిద్దాం... ఇప్పుడే... ఈ క్షణమే తేలిపోవాలనేం లేదుగా" అంది నాగరత్నం.

అలా అని. ఆ తర్వాత ఆ మాటా, ఈ మాటా చెప్పి రాణీని కొంతవరకూ చల్లబరిచింది. మర్నాడు మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళింది నాగరత్నం. ఆ రాత్రి రాణీకి సరిగా నిద్రపట్టలేదు.

***

పెళ్ళికి ముందునుంచే శ్రీధర్ తెలుసు రాణీకి. శ్రీధర్ కూడా ఏలూరులోనే చదువుకున్నాడు.

ఇద్దరిదీ ప్రేమించి చేసుకున్న పెళ్ళి కాకపోయినా, అన్ని విషయాలు ఆలోచించుకుని, ఇష్టపడి చేసుకున్న వివాహమే. అప్పుడూ నాగరత్నంతో చర్చించే నిర్ణయించుకుంది రాణీ.

శ్రీధర్‌ది మంచి ఆకర్షణ వున్న రూపం. చాలా మంది ఆడపిల్లలు అతనంటే ఇష్టపడటం రాణీకి, నాగరత్నానికీ తెలుసు. డిగ్రీ చదువుతుండగానే, ఇద్దరు అమ్మాయిలతో శ్రీధర్ గట్టి వ్యవహారమే సాగించాడు. కాలేజీలో ఆ విషయం చాలామందికి తెలుసు. వాళ్ళు అతని జీవితంలో ఎక్కువ కాలం ఉండలేదన్న సంగతి తెలుసు. అతను బ్రహ్మచారన్న నమ్మకం చాలా మందికి లేదు. రాణీకి, నాగరత్నానికీ కూడా లేదు.

అందమైన రాణీ అంటే ఇష్టపడ్డాడో, వాళ్ళ ఆస్తి అంటే ఇష్టపడ్డాడో.. లేదా రెండూ అనుకూలంగా వుంటాయనుకున్నాడో... శ్రీధరే పెళ్ళి ప్రస్తావన తీసుకొచ్చాడు. పెద్దవాళ్ళు కలిసి మాట్లాడుకున్నారు. విషయం తేల్చి చెప్పాల్సింది రాణీయే. అప్పుడే నాగరత్నంతో చర్చించింది.

"సూటిగా చెప్పు... అసలు శ్రీధర్ అంటే నీకిష్టమేనా..." అనడిగింది నాగరత్నం.

"ఇష్టమే..."అంది రాణి. "మరి అభ్యంతరం ఏమిటి?" అనడిగింది నాగరత్నం. రాణీ ఏం మాట్లాడలేదు. అభ్యంతరమేమిటో నాగరత్నానికి తెలుసు.

"శ్రీధర్ కాదు. మరొకతను అనుకో... అతని విషయం మాత్రం, పెళ్ళికి ముందు ఏం జరిగిందో ఎలా తెలుస్తుంది. అందువల్ల ఆ ఒక్క అభ్యంతరమే అయితే... మిగిలినదంతా ఇష్టమే అయితే.. ఒప్పుకోవచ్చు" అని ఇద్దరూ కలిసి నిర్ణయానికి వచ్చారు.

అందంతోపాటు శ్రీధర్‌కి మంచి తెలివితేటలున్నాయి. కట్నంగా రాణీ వాళ్ళిచ్చిన డబ్బు తీసికెళ్ళి వైజాగ్‌లో మంచి అదనుచూసి రియల్ ఎస్టేట్‌లో పెట్టాడు. రెండేళ్ళలో బ్రహ్మాండంగా సంపాదించాడు. తక్కువ శ్రమతో ఎక్కువగా కలిసొచ్చిన లాభాలు. మనసు, శరీరం అదనపు సుఖాల వేపు పరిగెట్టాయి.

'నాగరత్నం అన్నది నిజమే. శ్రీధర్‌తో విడిపోయాక ఏమిటి? శ్రీధర్ తప్ప తనకి వేరే దారే లేదా? అతను చేసిన వెధవ పనికి శిక్ష తనకా... విడాకులు తీసుకుని, తను అన్నీ వదలుకుని బతకాలా.... తనూ సుఖపడాలి.

తిక్క... ఓ రకం పంతం... రాణీని కమ్ముకున్నాయి. శ్రీధర్‌ని బాధ పెట్టాలి. సంసారమంటే ఏమిటో, దాని విలువేమిటో తెలిసొచ్చేలా బాధ పెట్టాలి.

రాణీ ఆలోచన కొత్త దారి పట్టింది. ఏదేదో ఊహిస్తూ నాగరత్నం కోసం ఎదురు చూస్తోంది.

నాగరత్నం రాలేదు కానీ, ఫోన్ వచ్చింది. శ్రీధర్ అయితే ఏం చెయ్యాలి అనుకుంటూ నెంబర్ చూసింది. శ్రీధర్‌కాదు.

"నేను సుబ్బారావుని... ఇందాక నాగరత్నం కనిపించింది. ఊళ్ళో వున్నావని చెప్పింది".

"ఇంట్లోనే వున్నారా.." అంది రాణి.

పది నిముషాల్లో రాణీ ముందున్నాడు సుబ్బారావు. ఇంటి దగ్గరకి వచ్చాకే ఫోన్‌చేశాడన్న మాట అనుకుంది. రాణీ వాళ్ళింటి పక్కన చాలా ఏళ్ళు అద్దెకున్నారు సుబ్బారావు వాళ్ళు. తన వయసు వాడే.

తనంటే సుబ్బారావు పడి చస్తాడని చాలా ఏళ్ళ నుంచి రాణీకి తెలుసు. అమ్మాయిలు కోరుకునే నాయక లక్షణాలేం లేవు అతన్లో. మనిషి చాలా మృదువు... 'నీ దేవదాసే'... అని నాగరత్నం రాణీని ఆట పట్టించేది. సుబ్బారావుకి తాగటం కూడా చేతకాదని నవ్వుకునే వారు.

## వర్తన

కొనగోట తాకితేనే పువ్వు రాలిపోతది
వాడెంత దుర్మార్గుడో
రాలి పడిన పువ్వు చెపుతది
పాదం పడగానే
ప్రవహించే వాగు ఠక్కున ఆగిపోతది
వాడెంత విష పాతకుడో
వాగులోని ప్రతి ఇసుక రేణువు వర్ణిస్తది
నూరు నాలుకల వాని
నుదురెంత కారెడ్డె మైందో
మన అనుభవం చెపుతానే వుంది
పిట్టలకేమిటి?
చారెడు గింజలే మహాప్రసాదం
వలనూ
వలపునూ గుర్తు పట్టటమే ఇప్పటి పరీక్ష
వాడు వాలగానే
ఏడంతస్తుల స్వప్నం
తటాలున కూలిపోతది
మనసుదేమిటి?
మాయ కబుర్లకు ఉబ్బిపోతది
గుంటనూ,
కొలననూ గుర్తు పట్టటమే ఇప్పటి నైపుణ్యం
వాడు
వేయి నాగజెముళ్ళు
లోపల దాచుకున్న నెమలి ఫించం
ఎందరి స్థలాలనో తలకిందులు చేశాడు
వాడి స్థలాన్ని గుర్తించటమే ఇప్పటి పరీక్ష
వాడి తలను గుర్తించటం ఇంకా విషమ పరీక్ష




-నందిని సిధారెడ్డి
సెల్: 94403 81148

సుబ్బారావుతో వేళాకోళాలు చిన్నప్పట్నించీ అలవాటేరాణీకి. ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

''మీ వాళ్ళు నీకు పెళ్ళి చెయ్యరా...'' అంది నవ్వుతూ రాణి.

''చేసుకోమనే అంటున్నారు..'' అన్నాడు సుబ్బారావు.

పెద్దగా చొరవ వున్న మనిషి కాదు. కానీ అతని చూపుల్లో ఇష్టం ఇప్పటికీ అలాగే వున్నట్టునిపించింది రాణీకి. అతనితో మాట్లాడుతూనే ఆలోచిస్తోంది.

మరి కాస్సేపటికి నాగరత్నం వచ్చింది. తను వచ్చిన పది నిముషాల తర్వాత సుబ్బారావు వెళ్ళిపోయాడు.

''సుబ్బారావుని రెండు రోజులు శెలవపెట్టమన్నాను. ఇద్దరం ఎటేనా వెళ్ళొస్తాం..'' అంది రాణీ.

''ఎటేనా అంటే...'' అనడిగింది నాగరత్నం.

''విజయవాడో... హైదరాబాదో... ఎటో ఒకటీ... ఎప్పట్నించో నేనంటే పడి చస్తున్నాడు... అతనితో కమిట్ అవుతాను..'' అంది. అలా అన్న రాణీ గొంతులో ఓ రకం మొండి నిర్ణయం ధ్వనించింది నాగరత్నానికి.

''కమిట్ అవుతావు సరే... ఆ తర్వాత..''

''ఆ తర్వాతేమిటే... అస్తమానం ఆ తర్వాత... ఆ తర్వాత అంటావు'' అంది విసుగ్గా రాణీ.

''నేను అన్నా... అనకపోయినా... ఆ తర్వాత ఏదో ఒకటి జరగాలిగా... సుబ్బారావుతో కమిట్ అయ్యాక శ్రీధర్ దగ్గర కెళ్ళి కాపరం చేస్తావా?''

''ఏమో.. వెడితే వెడతాను... లేకపోతే ఇక్కడే వుంటాను.'' అంది రాణి.

రాణీ ఆలోచనలో ఉక్రోషం ఎంతుందో నాగరత్నానికి తెలుసు. ''అసలేమిటే నీ బాధ. శ్రీధర్ ఎప్పుడూ ఇంకో ఆడదాన్ని ఆశించని ప్రవరాఖ్యుడేం కాదు... అది నీకూ తెలుసు..''

''తెలిస్తే మాత్రం.. అదీ ఇదీ ఒకటేనా.. ఆ వయసులో ఎవర్నో ఇష్ట పడటం. ఇప్పుడిలా డబ్బుతో, ఓ వ్యసనంలా ప్రత్యేకమైన ఇష్టమేం లేకుండా, ఆడదాన్ని కొనుక్కోవటం ఒక్కటేనా...'' అంది ఆవేశపడుతూ రాణి.

''ఖచ్చితంగా కాదు.... అదే నేనూ అనేది. సుబ్బారావుతో నువ్వు చేస్తానంటున్నదేమిటీ? అతనంటే అపరిమిత ఇష్టం వుందా నీకు. లేదు. ఓ జాలితోటో, శ్రీధర్ మీద కోపంతోటో... ఇలాంటి ఆలోచనలు చెయ్య కూడదు. దీనివల్ల బాధ మరింత పెరుగుతుందే తప్ప ఏ మాత్రం సుఖపడలేవు... ఆలోచించుకో..'' అంది నాగరత్నం.

పరిస్థితి మరింత ఉక్కిరి బిక్కిరిగా తయారైంది రాణీకి. ఏ క్షణంలో ఏం చేస్తుందో తనకే తెలియటం లేదు.

***

నాగరత్నంలోనూ కంగారు మొదలైంది. రాణిలో అంత మొండితనం, ఆవేశం ఎటు దారితీస్తాయో తెలియదు. శ్రీధర్, రాణీ చెరోవేపు బిగిసిపోయారు. కాలానికి వదిలేసి కూర్చునే వ్యవహారంలా కనిపించటం లేదు. ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చింది. శ్రీధర్‌కి ఫోన్‌చేసి...

''నేనూ... నాగరత్నాన్ని...'' అంది.

''మీ స్నేహితురాలు అంతా చెప్పిందా... ఇంకా ఎన్నాళ్ళు అలా పుట్టింట్లోనే వుంటుంది..'' అన్నాడు.

''నువ్వింత పనిచేశాక, పుట్టింట్లోనే కూచుంటుందని ఎందుకు అనుకుంటున్నావ్...''

''నేనేం చేశాను. వ్యాపారం పనిమీద ఆ రిసార్ట్‌కి వెళ్ళి ఇరుక్కు పోయానని చెప్పానుగా..''

''ఈ బుకాయింపే బాగోలేదు శ్రీధర్. రాణీకి అసలు ఈ విషయం చెప్పకుండా వుండాల్సింది. చెప్పినప్పుడు, చేసిన తప్పు ఒప్పుకుని, నిజాయితీగా నీగోడు చెప్పుకోవాలి. అబద్ధాలు చెప్తేస్తే రాణీ నమ్మేస్తుందనుకోకు.. తనూ నీలాగే ఏదేనా చేస్తే...'' అంది కొంచం గట్టిగా నాగరత్నం.

''అంటే ఏం చేస్తుంది...'' అన్నాడు కొంచం కంగారుగా శ్రీధర్.

''ఏమో... ఏదేనా చెయ్యొచ్చు. ఈ రోజుల్లో మగాళ్ళకెన్ని అవకాశా లున్నాయో.. ఆడవాళ్ళకీ... అంటే రాణీకూడా.. అన్ని అవకాశాలూ వున్నాయని అర్థం చేసుకో... వెంటనే వచ్చి, నిజాయితీగా నీ గోల చెప్పుకుని, మరోసారి తనకెలాంటి బాధ కలగదని నమ్మకం కలిగించు... లేకపోతే నీ కాపరానికి నీళ్ళొదులుకో..'' అని చెప్పాల్సిన నాలుగు విషయాలు చెప్పింది నాగరత్నం.

తెల్లారేటప్పటికి శ్రీధర్ వచ్చేశాడు. భర్త రావటం ఉపశమనంగా వున్నా, చాలాసేపు బిగుసుకుపోయే వుంది రాణీ. వెనక, వెనకే తిరిగి, మొత్తానికి రాణీని ప్రసన్నం చేసుకున్నాడు శ్రీధర్.

ఆ మధ్యాహ్నమే నాగరత్నానికి ఫోన్ చేసి... తెల్లారే శ్రీధర్‌తో కలిసి వెడుతున్నట్టు చెప్పింది రాణి.

''ఏమన్నాడు మీ ఆయన...'' అనడిగింది నాగరత్నం.

''బతిమాలుకున్నాడు... ఇంకెప్పుడూ ఇలా చెయ్యనని సిన్సియర్‌గానే చెప్పాడు. పోతే... నిజంగా ఏమేనా చేద్దామనుకున్నావా? అనడిగాడు..'' అంది రాణీ నవ్వుతూ...

''ఏం చెప్పావు?''

''నిజమే చెప్పాను... సుబ్బారావు సంగతి.. అమ్మ బాబోయ్ అన్నాడు..''

''అనడు మరి.. అందరు మగాళ్ళూ అంతే... పెళ్ళాం పవిత్రత చెడి పోతుందనే చచ్చే భయం... ఆ మాత్రం భయం వుండటం మంచిదేలే... ఇంతకీ సుబ్బారావు సంగతేం చేశావు..'' అనడిగింది నాగరత్నం కూడా నవ్వుతూ.

''ఛీ... ఊరుకోవే...'' అంది రాణి.

''శెలవు పెట్టొద్దని నేను ఫోన్ చేసి చెపుతాలే..'' అంది నాగరత్నం.

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

రాణీయే కాదు... చాలామంది ఆడవాళ్ళు రకరకాలుగా, రాణీలాగే ఆవేశ పడే సందర్భాలుంటాయి. కానీ మగాళ్ళు తొందరపడినట్టు తొందర పడరు. తప్పుచేసి మగాడు మరిచిపోయినంత తేలిక కాదు వాళ్ళకి. తప్పు చేశామన్నబాధ, వాళ్ళనంత తొందరగా వదలడు. అటువంటి తొందర వల్ల దక్కే సుఖం కన్నా, తప్పు అన్న అపరాధ భావమే వాళ్ళని ఎక్కువగా బాధిస్తుంది.

అందుకే... ఆడతనపు ఓ తెర వాళ్ళని ఎప్పుడూ అటువేపే ఉంచుతుంది. ఈ బలం వల్లే ఇంకా చాలా సంసారాలు నిలబడి వున్నాయన్న సంగతి స్త్రీగా నాగరత్నానికే తెలుసు. మంచిఎప్పుడూ సుఖాన్నే ఇస్తుందన్న అద్భుత నమ్మకం ఆడదానికి.

★

రచయిత సెల్: **93947 38805**

